# ఐదో రోజు పందొమ్మిది నామినేషన్లు

ఎదులాపురం, నవంబర్ 8 : ఐదో రోజు బుధవారం ఆదిలాబాద్ నియోజకవర్గానికి 10 నామినేషన్లు దాఖలైనట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. బీఆర్ఎస్ అభ్యర్థి జోగు రామన్న, ఎక్తా పార్టీ అభ్యర్థి కేమ శ్రీనివాస్, ధర్మ సమాజ్ అభ్యర్థి అగ్గిమల్ల గణేశ్, బహుజన సమాజ్ పార్టీ అభ్యర్థి ఉయిక ఇందిర, బహుజన ముక్తి పార్టీ అభ్యర్థి సూర్యవంశీ, కాంగ్రెస్ అభ్యర్థి కంది శ్రీనివాస్ రెడ్డి, స్వతంత్ర అభ్యర్థులుగా భాను రాజేశ్వర్ రావు, ఎన్ సుభాష్, అస్లాం,బీజేపీ అభ్యర్థి పాయల్ శంకర్ తరపున మరోసెట్ నామినేషన్లు వేసినట్లు పేర్కొన్నారు. ఈ ప్రక్రియలో రిటర్నింగ్ అధికారి బీ స్రవంతి అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

**బోథ్‌లో రెండు నామినేషన్లు..**

బోథ్, నవంబర్ 8 : బోథ్ శాసనసభకు పోటీ చేసేందుకు బుధవారం రెండు నామినేషన్లు దాఖలైనట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి చహత్ బాజ్‌పాయ్ తెలిపారు. ధర్మసమాజ్ పార్టీ (డీఎస్‌పీ) అభ్యర్థిగా ఉయిక ఉమేశ్, స్వతంత్ర అభ్యర్థి తొడసం ధనలక్ష్మి నామినేషన్ దాఖలు చేశారు. ఇప్పటి వరకు మూడు నామినేషన్లు దాఖలైనట్లు ఆర్వో తెలిపారు.

**నిర్మల్‌లో ఐదు నామినేషన్లు**

నిర్మల్ టౌన్, నవంబర్ 8 : నిర్మల్ అసెంబ్లీ స్థానానికి బుధవారం మరో ఐదు నామినేషన్లు దాఖలైనట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో రత్నకల్యాణి తెలిపారు. ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ అభ్యర్థిగా స్వదేశీ పరికిపండ్ల, డీఎస్పీ అభ్యర్థిగా రామారావు, పాత్రికేయుల నుంచి చౌహాన్ సుదర్శన్‌నాయక్, స్వతంత్ర అభ్యర్థులుగా రాజు, పృథ్వీదర్‌లు నామినేషన్లు వేశారని పేర్కొన్నారు.

**ముథోల్‌లో నామినేషన్లు నిల్**

ముథోల్, నవంబర్ 8 : ముథోల్ అసెంబ్లీ నియోజకవర్గానికి బుధవారం నామినేషన్లు దాఖలు కాలేదని రిటర్నింగ్ అధికారి కోమల్ రెడ్డి తెలిపారు. కార్యాలయం వద్ద ఎస్ఐ సాయికిరణ్ ఆధ్వర్యంలో బీఎస్ఎఫ్ బలగాలు బందోబస్తు నిర్వహించారు.

**రెండు నామినేషన్లు దాఖలు**

ఉట్నూర్, నవంబర్ 6 : ఖానాపూర్ శాసనసభ స్థానానికి బుధవారం ఇద్దరు అభ్యర్థులు నామినేషన్లు వేసినట్లు ఆర్డీవో తెలిపారు. ఎన్నికల రిటర్నింగ్ కార్యాలయంలో కాంగ్రెస్ అభ్యర్థి వెడ్మ బొజ్జు, సీపీఐ ఎంఎల్(రెడ్‌స్టార్) పార్టీ అభ్యర్థి పెందూర్ ప్రియాంక నామపత్రాలు అందజేశారని పేర్కొన్నారు.

# అభివృద్ధిని చూసి ఆశీర్వదించండి..

- రైతు బంధు, ఆసరా పింఛన్ కావాలంటే కారుకు ఓటు వేయండి
- ఎన్నికలప్పుడు వచ్చే నాయకులను నిలదీయండి
- ఎన్నికల ప్రచారంలో మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి



దిలావర్‌పూర్ : కాల్వలో మాట్లాడుతున్న మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి

దిలావర్‌పూర్, నవంబర్ 8 : ఎన్నికలప్పుడు మాత్రం వచ్చే బీజేపీ, కాంగ్రెస్ పార్టీల నాయకులను నిలదీసి అభివృద్ధికి ఓటు వేయాలని నిర్మల్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి, మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్ మండలంలోని కాల్వ, కాల్వ తండా, సిర్గాపూర్, మాయాపూర్, ఓడ్డెపల్లి, కంజర్, బన్సపల్లి, సాంగ్వి గ్రామాల్లో బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో మహిళలు, వృద్ధులు, యువకులు పెద్ద సంఖ్యలో హాజరై ఘనస్వాగతం పలికారు. అనంతరం గ్రామాల్లో ఆయన మాట్లాడుతూ నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలు పరిష్కరించే నాయకుడిని గుర్తించుకోవాలని ఎన్నికలు రాగానే ఆగం కావద్దని అన్నారు. బీజేపీకి ఓటు వేస్తే ఇప్పుడున్న గ్యాస్ సిలిండర్ ధర రూ. 2400 చేస్తుందని, కారు గుర్తుకు ఓటు వేస్తే సిలిండర్‌ను రూ.400 ఇస్తామని చెప్పారు. కాంగ్రెస్ పార్టీకి ఓటు వేస్తే ఇప్పుడున్న 24 గంటల ఉచిత విద్యుత్ తీసి వేసి 3 గంటల కరెంట్ ఇచ్చే పార్టీ కావాల్లో రైతులు ఆలోచించాలని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రైతు బంధుకు రాంరామ్ పలుకుతారని, రాష్ట్రాన్ని రాబందులా పీక్కుతింటారని అన్నారు. అభివృద్ధి సంక్షేమం కోసం పనిచేసే నాయకుడిని గుర్తించాలని కోరారు. బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలోని ప్రభుత్వాన్ని గెలిపిస్తే వచ్చే మార్చి నుంచి ఆసరా పింఛన్‌ను పెంచుతామని,అర్హులైన వారందరికీ బీమా సౌకర్యం కల్పిస్తామని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు ఆడెపు తిరుమల, గంగారెడ్డి, శ్రీనివాస్, రొడ్డ మహేశ్, బన్సపల్లి సహకార సంఘం చైర్మన్ పీవీ రమణరెడ్డి, జిల్లా పరిషత్ కోఆప్షన్ సభ్యుడు డాక్టర్ సుభాష్‌రావు, బీఆర్ఎస్ నాయకులు పాల్దే శ్రీనివాస్, పూజారం మహేశ్, చిన్నయ్య, సాయన్న, శ్యాంసుందర్‌రెడ్డి, సక్కారాం, తదితరులు పాల్గొన్నారు.



దిలావర్‌పూర్ : బీఆర్ఎస్ చేరిన యువకులను కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి

**కాల్వలో బీజేపీకి బిగ్‌షాక్**

దిలావర్‌పూర్ మండలం కాల్వ గ్రామంలో బీజేపీ పార్టీకి బిగ్‌షాక్ తగిలింది. బుధవారం ఎన్నికల ప్రచారంలో భాగంగా గ్రామానికి వచ్చిన బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి, మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి సమక్షంలో బీజేపీ నాయకులు హర్షిత్(డింపు) తన అనుచరులతో కలిసి పార్టీలో చేరారు. అంతకుముందు మంత్రికి మోటరు సైకిల్ ర్యాలీతో స్వాగతం పలికారు. బీజేపీ నుంచి బీఆర్ఎస్‌లో చేరిన 50 మంది యువకులకు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలు బీఆర్ఎస్ వెంటనే ఉన్నారని అన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ఆడెపు శ్రీనివాస్, పాల్దే అపిల్, చిన్నయ్య, శ్రీనివాస్, మహేశ్ పాల్గొన్నారు.

# నేడు అల్లోల నామినేషన్

నిర్మల్ అర్బన్, నవంబర్ 8 : నిర్మల్ శాసనసభ స్థానానికి బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి రాష్ట్ర అటవీ, పర్యావరణ, న్యాయ, దేవాదాయ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి గురువారం నామినేషన్‌ను దాఖలు చేయనున్నారు. ఉదయం మంత్రి నివాసం నుంచి తన అనుచరగణంతో కలిసి వెళ్లి ఆర్డీవో (పాత కలెక్టరేట్) కార్యాలయంలోని రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలు సమర్పించనున్నారు. 2014 ఎన్నికల్లో బీఎస్పీ తరపున పోటీ చేసి సమీప అప్పటి టీఆర్ఎస్ అభ్యర్థి కూచాడి శ్రీహరిరావుపై ఘన విజయం సాధించారు. అనంతరం టీఆర్ఎస్ పార్టీ చేరి మంత్రి మండలిలో రాష్ట్ర గృహ నిర్మాణ, న్యాయ, దేవాదాయ శాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం జరిగిన 2018 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సమీప అభ్యర్థి ఏలేటి మహేశ్వర్ రెడ్డిపై భారీ మెజార్టీతో ఘన విజయం సాధించడంతో మరోసారి రాష్ట్ర మంత్రి మండలిలో రాష్ట్ర అటవీ, పర్యావరణ, న్యాయ, దేవాదాయ, శాస్త్ర సాంకేతిక శాఖ మంత్రిగా పదవి బాధ్యతలు నిర్వహించారు. ప్రజలు, అధికారుల నుంచి మంచి నాయకుడిగా గుర్తింపును తెచ్చుకున్నారు. దీనిని గుర్తించిన అధిష్ఠానం మరో సారి మొదటి జాబితాలోనే బీఆర్ఎస్ పార్టీ నిర్మల్ నియోజకవర్గ అభ్యర్థిగా ప్రకటించి బీఫామ్ అందజేసింది. గురువారం ముఖ్య నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, బీఆర్ఎస్ శ్రేణులు, పట్టణ ప్రజలతో కలిసి నామినేషన్ వేయనున్నారు.

# రేవంత్ పర్యటనలో నిరసనకు యత్నం

- పలువురు అరెస్ట్

ఆదిలాబాద్, నవంబర్ 8 ( నమస్తే తెలంగాణ): టీపీసీసీ అధ్యక్షుడు బుధవారం ఆదిలాబాద్ పట్టణంలో నిర్వహించే ప్రచారంలో భాగంగా ఆయన ముందు నిరసన తెలిపడానికి ప్రయత్నించిన పలువురిని పోలీసులు ముందుగానే అరెస్ట్ చేశారు. ఆదిలాబాద్ టికెట్‌ను కంది శ్రీనివాస్‌రెడ్డికి ఇవ్వడాన్ని నిరసిస్తూ డీసీసీ అధ్యక్షుడు సాజిద్‌ఖాన్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సుజాత, సీనియర్ నాయకులు ఇటీవల పార్టీకి రాజీనామా చేశారు. రేవంత్ పర్యటనలో సేవ్ కాంగ్రెస్ నినాదంతో నిరసన చేయడానికి సిద్ధమవుతున్న వారిని పోలీసులు అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు.



నిరసన తెలపడానికి ప్రయత్నించిన వారిని అరెస్ట్ చేస్తున్న పోలీసులు

# సీఎం కేసీఆర్‌కు మరోసారి అవకాశం ఇవ్వాలి



సాయిబాబా ఆలయంలో పూజలు చేస్తున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి జోగు రామన్న దంపతులు

ఎదులాపురం, నవంబర్ 8 : సీఎం కేసీఆర్ రాష్ట్రంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి తమను గెలిపిస్తాయని ఆదిలాబాద్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి జోగు రామన్న అన్నారు. నామినేషన్ ప్రక్రియలో భాగంగా బుధవారం తన నామపత్రాలు రిటర్నింగ్ అధికారికి సమర్పించారు. ముందుగా శాంతినగర్‌లోని సాయిబాబా ఆలయంలో సతీసమేతంగా ప్రత్యేక పూజలు చేశారు. అదేవిధంగా చాందా దర్గాలో చాదర్ సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. దర్గా కమిటీ సభ్యులు ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం మత పెద్దల సమక్షంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అలాగే సాత్నాల బస్టాండ్ సమీపంలో చామన్‌వాలా బాబా దర్గాలో చాదర్ సమర్పించారు. అనంతరం ముస్లిం సోదరులు జోగు రామన్నను ఆలింగనం చేసుకుంటూ శుభాకాంక్షలు తెలిపారు. అక్కడి నుంచి నేరుగా ఆర్వో కార్యాలయానికి వచ్చారు. నలుగురు మద్దతుదారులతో కలిసి ఆర్వో శ్రవంతి నామినేషన్ పత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అభ్యర్థి జోగు రామన్న మాట్లాడుతూ నియోజవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడానికి కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. ప్రజాహితమే లక్ష్యంగా ముందుకు సాగుతున్న బీఆర్ఎస్ పార్టీకి ఎదురు లేదని ధీమా వ్యక్తం చేశారు. తనకు మరోసారి ఎమ్మెల్యే అభ్యర్థిగా అవకాశం కల్పించిన సీఎం కేసీఆర్‌కు ధన్యవాదాలు తెలిపారు. ఆయన నమ్మకాన్ని నిలబెట్టుకుంటామన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, పట్టణ అధ్యక్షుడు అలాల్ అజయ్, న్యాయవాది కేమ శ్రీకాంత్, ఎంపీపీ గండ్రత్ రమేశ్, ఆత్మ చైర్మన్ జిట్ట రమేశ్, మున్సిపల్ వైస్ చైర్మన్ జహీర్ రంజానీ, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మెట్టు ప్రహ్లాద్, దుర్గం ట్రస్ చైర్మన్ దుర్గం శేఖర్, మహిళా విభాగం అధ్యక్షురాలు స్వరూపరాణి, కార్యదర్శి మమత , బీసీ సెల్ పట్టణ అధ్యక్షుడు దాసరి రమేశ్, నాయకులు సాజిదుద్దీన్, శివకుమార్, సాయి, కరింగుల ప్రణయ్, కుమ్ర శ్రీనివాస్, సేవ్వ జగదీశ్, తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్‌లో చేరిన భరత్ చౌహాన్

ఉట్నూర్, నవంబర్ 8: కాంగ్రెస్ పార్టీలో ఖానాపూర్ నియోజకవర్గానికి టికెట్ ఆశించి భంగపడ్డ సీనియర్ నాయకుడు భరత్ చౌహాన్ బుధవారం హైదరాబాద్‌లోని ప్రగతిభవన్‌లో మంత్రి కేటీఆర్ సమక్షంలో రవీందర్ రావు ఆధ్వర్యంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను కాంగ్రెస్ పార్టీకి కట్టుబడి ఉండి కార్యకర్తలాగా పని చేశానన్నారు. అటువంటి నాకు పార్టీలో రేవంత్‌రెడ్డి తీవ్ర అన్యాయం చేశారన్నారు. కాంగ్రెస్‌లో బంజారాలను కావాలనే బలిచేశారని పేర్కొన్నారు. తమని ఆదరిస్తున్న బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్నట్లు పేర్కొన్నారు. బీఆర్ఎస్ అభ్యర్థి భూక్యా జాన్సన్ నాయక్‌ను గెలిపించేందుకు కృషి చేస్తామన్నారు. ఆయన అనుచరులు మల్లారెడ్డి, పలువురు ఉన్నారు.



మంత్రి కేటీఆర్‌తో కరచాలనం చేస్తున్న భరత్ చౌహాన్

## స్వతంత్ర అభ్యర్థిగా బరిలో ఉంటా

తాంసి, నవంబర్ 8: కాంగ్రెస్ అధిష్ఠానం బోథ్ అభ్యర్థిగా వన్నెల అశోక్‌ను తప్పించి ఆడె గజేందర్‌ను ఖరారు చేసిన విషయం తెలిసిందే. వన్నెల అశోక్ పార్టీ ముఖ్య నేతలతో కలిసి సమావేశమయ్యారు. బోథ్ నుంచి స్వతంత్ర అభ్యర్థిగా బరిలో ఉంటున్నట్లు వన్నెల అశోక్ తెలిపారు. ఆయన ఈ నెల 10న నామినేషన్ వేయనున్నట్లు వెల్లడించారు. బోథ్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ పతనం ప్రారంభమైందని అన్నారు. ముందుగా టికెట్ ఇచ్చి మళ్లీ వేరే అభ్యర్థికి ఇవ్వడం సరికాదన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నారాయణ, సంతోష్, లక్ష్మీపతి, కార్యకర్తలు పాల్గొన్నారు.